# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

2. మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు నుంచి జిల్లాల పర్యటనల్లో పాల్గొంటారు.

3. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో కంటి సమస్యలను గుర్తించడం ద్వారా అంధత్వలోపాల సమస్యలను నివారించవచ్చని ఆంధ్రప్రదేశ్ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

4. ఆంధ్రప్రదేశ్‌లో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఏప్రిల్ నుండి ప్రత్యేక కార్యాచరణను ప్రారంభిస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ను ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చేలా 50 లక్షల ఎకరాల్లో సాగుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ శాఖలపై అధికారులతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యత తెలిసేలా ధృవీకరణ, గుర్తింపు సదుపాయం కల్పించాలని సూచించారు. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని, లంబసింగిలో కుంకుమ పువ్వు సాగుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు నుంచి జిల్లాల పర్యటనలు ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఈ రోజు నల్గొండ జిల్లాలోని మిర్యాల గూడలో పర్యటిస్తారు. అలాగే జిల్లాలోని గూడూరు గ్రామంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. రేపు కరీంనగర్ జిల్లా ఎల్లుండి నిజామాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ఈ నెల 7 వ తేదీన రంగారెడ్డి జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో, 8న వరంగల్ జిల్లా భూపాలపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

-------------------------

దేశ సుస్థిర ప్రగతికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, వికసిత్ భారత్–2047 కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని చెప్పారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రానుందని , ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ ఔషధాల కేంద్రంగా మరింత అభివృద్ధి కానుందని కేంద్ర మంత్రి వివరిస్తూ

వాయిస్ 33సెకన్లు

---------------------------

వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఆరోగ్య, ఆహార భద్రతతో కూడిన విద్య అందించాలన్నదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు.బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పథకాలు, వసతి గృహాలు, గురుకులాల అభివృద్ధికి నిధులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 238 బీసీ వసతి గృహాల మరమ్మతులకు 20 కోట్ల రూపాయల మంజూరు చేశామని చెప్పారు. సన్న బియ్యంతో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం సూచించిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఇటీవల వంట కమిటీలను నియమించామన్నారు.

---------------------------

అన్ని విభాగాల్లోనూ నూతన విధానాలను ప్రవేశపెట్టి విశాఖపట్నంలోని ఉక్కు కర్మాగారాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం పురోగతిపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ 2026 జనవరిలో 54 కోట్ల లాభాన్ని ఆర్జించిందని తెలిపారు. విశాఖ ఉక్కు పూర్తి ఉత్పత్తి సామర్థ్యం సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో కంటి సమస్యలను గుర్తించడం ద్వారా అంధత్వలోపాల సమస్యలను నివారించవచ్చని ఆంధ్రప్రదేశ్ వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ప్రభుత్వ పాఠశాలలో మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి పిల్లలకు కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని నిన్న సాయంత్రం ప్రారంభించారు. అనంతరం సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ,

వాయిస్ 25..సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఏప్రిల్ నుండి ప్రత్యేక కార్యాచరణను ప్రారంభిస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ – 2026 పోటీల్లో గెలుపొందిన విజేతలను అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సత్కరించారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహతో లఘు చిత్రాలు రూపొందించిన యువ దర్శకులు, సాంకేతిక నిపుణులు, నటీనటులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం

ఆయన మాట్లాడుతూ, అమరావతిని సినిమా రంగానికి కేంద్రబిందువుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రుపొందిస్తుందని చెప్పారు. త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో నిన్న రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. జిల్లాలోని మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి నీటి గుంతలో బోల్తా పడిందని ఈ ఘటనలో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందారని పలువురికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం కొనసాగుతుందని, పలుచోట్ల పొగమంచు కురిసే అవకాశముందని పేర్కొంది.

ఇక మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతపల్లిలో 12.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణా కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 12.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

---------------------------

చెరకు రైతులను ఆదుకొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలో చెరకు రైతుల పరిస్థితి, సాగు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో అమరావతి నుంచి దృశ్య మాధ్యమం విధానంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, చెరకు రైతులు నష్టపోకుండా జిల్లాలోని సంకిలిలో ఉన్న చక్కెర కర్మాగారం మూతబడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమ మనుగడకు అనుగుణంగా చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీనిలో భాగంగా చెరకు రైతుకు అన్నివిధాలా తగిన ప్రోత్సాహాన్ని అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

=====================